కెనడా రేడియోలో నగరవాసి ఆంగ్ల కవిత ప్రసారం


అశోక్ చక్రవర్తి

అబిడ్స్: నగరానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగి రచించిన ఆంగ్ల కవిత కెనడా రేడియోలో ప్రసారమైంది. అబిడ్స్‌లోని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్‌లో 30 ఏళ్ల పాటు విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన టి.అశోక్ చక్రవర్తి తమ ఆంగ్ల కవితల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రతిభను కనబరుస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. గతంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, మాజీ ప్రధాన మంత్రి అటల్‌బీహారి వాజ్‌పేయ్‌లతో పాటు పలు దేశాల ప్రముఖులు ఆయన రాసిన ఆంగ్ల కవితలను ప్రశంసించారు. తాజాగా యునెస్కో వారి అంతర్జాతీయ కవితల దినోత్సవం సందర్భంగా కెనడాకు చెందిన వరల్డ్ పోయేట్రీ కేఫ్ రేడియో వారు అశోక్ చక్రవర్తి రచించిన 'ట్రాన్స్‌ఫార్మేషన్' కవితను ఎంపిక చేసి ప్రసారం చేశారు. ఈ ఆంగ్ల కవితను కెనడా రేడియో 180 దేశాల్లో ప్రసారం చేసిందని అశోక్ చక్రవర్తి ఈ సందర్భంగా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది తనకు లభించిన అరుదైన అవకాశమని చెప్పారు. తాను గతంలోనూ పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ అనేక కవితలు రాసినట్లు పేర్కొన్నారు.

బండి సంజయ్‌కు ఆహ్వానం


ఆహ్వాన పత్రాన్ని బండి సంజయ్‌కు అందజేస్తున్న బీజేపీ నాయకులు

గోల్కొండ: ఈ నెల 11న గుడిమల్కాపూర్‌లో నిర్వహిస్తున్న జ్యోతిరావు పూలే జయంతి వేడుకలకు హాజరుకావాలని బీజేపీ నాయకులు మంగళవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఆహ్వాన పత్రం అందజేశారు. ఆయన తప్పకుండా హాజరవుతానని అన్నారు. ఆయనను కలిసిన వారిలో అనిల్‌కుమార్, దేవర వంశీ, పి.శ్రీనివాస్ తదితరులున్నారు.

ఫుట్‌పాత్‌లపై డబ్బాలను తొలగించాలని ఫిర్యాదు


ఫిలించాంబర్ వద్ద ఏర్పాటు చేసిన డబ్బా

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ ఫిలింఛాంబర్ వద్ద నుంచి కొత్త చెరువు వరకు రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలంటూ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 ఏఎంహెచ్‌వో డాక్టర్ కేఎస్.రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. రాత్రికి రాత్రే ఫిలించాంబర్ వద్ద ఓ డబ్బాను తీసుకొచ్చి పెట్టారని కొంత మంది జీహెచ్‌ఎంసీ ముసుగులో డబ్బాలు ఏర్పాటు చేసి దందాలు చేస్తున్నారని, దీంతో ట్రాఫిక్ జామ్‌లతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించడంతో పాటు డబ్బాలు ఏర్పాటు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 14వ తేదీ వరకు కిస్మత్‌పూర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయం ధ్రువీకరణ పత్రం, ఆహార భద్రత కార్డు, వికలాంగులకు వికలాంగుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత, ఏదైనా ట్రెనింగ్ పొందిన ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్ జత చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ/ఈడబ్ల్యూఎస్ వర్గాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మురుగు సమస్యకు చెక్


వ్యర్థాలను తొలగిస్తున్న జలమండలి సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12 ఎమ్మెల్యే కాలనీ ఏసీబీ కార్యాలయం వద్ద గడిచిన రెండు రోజులుగా మురుగు సమస్య వేధిస్తుండటంతో అటు ఏసీబీ కార్యాలయ అధికారులతో పాటు ఎమ్మెల్యే కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీంతో జలమండలి అధికారులు స్పందించారు. ఏసీబీ కార్యాలయం వద్ద ఉన్న మ్యాన్‌హోల్‌లో జెట్టింగ్ మిషన్ ద్వారా ఇరుక్కుపోయిన వ్యర్థాలను, సిల్ట్‌ను మంగళవారం తొలగించారు. దీంతో మురుగు సమస్యకు పరిష్కారం లభించింది.


మల్లేపల్లి జెట్ కేఫ్ వద్ద స్తంభించిన ట్రాఫిక్


సీతారామ్‌బాగ్‌లోని విస్తరణకు నోచుకోని రోడ్డు

రోడ్ల విస్తరణ జరిగేదెన్నడో..?

- నాంపల్లిలో తప్పని ట్రాఫిక్ తిప్పలు
- కనిపించని ట్రాఫిక్ సిగ్నల్స్
- ముందుకు సాగని విస్తరణ పనులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు

నాంపల్లి: రోడ్ల విస్తరణ పనులు నాంపల్లిలో ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. విస్తరణలో భాగంగా కూల్చాల్సిన భవనాలకు ఇప్పటికే నష్టపరిహారం చెల్లించినా జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చలేని పరిస్థితిలో ఉన్నారు. కొన్ని చోట్ల విస్తరణకు కొన్ని ఇళ్లకు నోటీసులు జారీ చేశారు. మరికొన్ని చోట్ల మార్కింగ్ వేశారు. ఇంకొన్ని చోట్ల సగం సగం పనులు చేసి మధ్యలోనే ఆపేశారు. ప్రధాన చౌరస్తాల్లో కూడా జీహెచ్‌ఎంసీ అధికారులు విస్తరణ పనులు చేపట్టలేని నిస్సహాయ స్థితిలో ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నష్టపరిహారం చెల్లించినా..

నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని ఏక్ మినార్ మసీదు రోడ్డుకు బాధితులకు నష్టపరిహారం చెల్లించి ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆక్రమణలను కూల్చిన దాఖలాలు లేవు. ఇక దారుస్సలాం నుంచి ఏక్ మినార్ మసీదు వరకు రోడ్ల విస్తరణ పనులు జీహెచ్‌ఎంసీ అధికారులు మార్కింగ్ చేసినా కూల్చేయడానికి ముందుకు రావడం లేదు. ఇక మల్లేపల్లి చౌరస్తాలో ఇటీవలే ఒక ఇంటిని కూల్చేసి మిగతా ఇళ్లను కూల్చకుండా మిన్నకుండిపోయారు. ఇక సీతారామ్‌భాగ్ నుంచి దారుస్సలాంకు వెళ్లే జాతీయ రహదారి విస్తరణ ఎప్పటి నుంచో పెండింగ్‌లోనే ఉంది. విస్తరణ పనులు చేపట్టాలని స్థానికుల నుంచి డిమాండ్ ఉన్నప్పటికీ జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ పనులు చేయడానికి ఏ మాత్రం ముందుకు రావడం లేదు.

400 మందికి నోటీసులు..

ఎస్‌ఎండీసీ నుంచి మాసబ్‌ట్యాంక్ వరకు వచ్చే రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటోంది. ఈ సమస్యను అధిగమించేందుకు హోటల్ అన్మోల్ నుంచి ఫస్ట్‌లాన్సర్‌కు వెళ్లే రోడ్డును విస్తరించడానికి జీహెచ్‌ఎంసీ ప్రణాళికలను తయారు చేసింది. ఇందులో భాగంగా 400 మందికి నోటీసులు కూడా జారీ చేసింది. నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయినా పనులు మాత్రం చేపట్టడానికి టౌన్ ప్లానింగ్ అధికారులు సిద్ధంగా లేరు. మల్లేపల్లి నుంచి బజార్‌ఘాట్‌కు వెళ్లే రోడ్డు పనులు, బజార్‌ఘాట్ నుంచి లక్డీకాపూల్ వెళ్లే రోడ్డు పనులు విస్తరణకు నోచుకోవాల్సిన అవసరం ఉంది.

కానరాని ట్రాఫిక్ సిగ్నల్స్..

ట్రాఫిక్ స్తంభించడానికి చౌరస్తాల్లో సిగ్నల్స్ లేకపోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేస్తే సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. రోడ్లను విస్తరించకపోవడం, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించకపోవడంతో ఈ సమస్య జఠిలంగా మారింది. నాంపల్లి పరిసర ప్రాంతాల్లోని ప్రధాన చౌరస్తాల్లో దారుస్సలాం నుంచి మెహిదీపట్నం వైపు వెళ్లే పాత ముంబై హైవే రోడ్డులోని ఏ చౌరస్తాలో చూసినా ట్రాఫిక్ సిగ్నల్స్ లేవు. ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కారణంగా నిత్యం ట్రాఫిక్ జంఝాటం అవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రహదారిలో ప్రయాణించాలంటూ నరకాన్ని చూడాల్సి వస్తోంది.

సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి..

రహదారి విస్తరణకు నోచుకోకపోవడం కూడా ట్రాఫిక్ స్తంభించడానికి ప్రధాన కారణం అవుతోందని స్థానికులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు నాంపల్లిలోని ప్రధాన చౌరస్తాల్లో సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. నోబుల్ టాకీస్ చౌరస్తా, బోయిగూడ కమాన్ చౌరస్తా, ఏక్ మినార్ చౌరస్తా, యూసుఫియన్ దర్గా చౌరస్తా, నాంపల్లి కోర్టు మార్గం, ఫ్యాప్సీ మార్గం, నాంపల్లి ముర్గీ మార్కెట్, నాంపల్లి ఏరియా ఆసుపత్రి, రియాన్ హోటల్ చౌరస్తాల్లో సిగ్నల్స్‌ను ఏర్పాటు చే స్తే ట్రాఫిక్ నియంత్రణకు మార్గం సుగమం అవుతుంది.

కొనసాగుతున్న వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు


పెద్ద శేష వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

లంగర్‌హౌస్: వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు సంగం రామచంద్రజీ మఠ ఆలయంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు రాత్రి స్వామి వారు పెద్దశేష వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. హోమాలు, పూజల అనంతరం వేదపండితులు రాజనర్సింహచారి ఆధ్వర్యంలో పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా స్వామి వారిని లంగర్‌హౌస్ పుర వీధుల్లో ఊరేగించారు. మంగళవారం ఉదయం నుంచి హోమాలు, విష్ణు సహస్రనామ పారాయణాలు నిర్వహించారు.

నేడు లక్ష్మీనరసింహ కల్యాణం..

లంగర్‌హౌస్‌లోని జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో నేడు మూలమంత్ర హోమాలు ఉంటాయి. రాత్రి 7 గంటలకు లక్ష్మీనరసింహుల కల్యాణ వేడుక నిర్వహించనున్నారు. అనంతరం కల్యాణ లక్ష్మీనరసింహులను వీధుల్లో ఊరేగించనున్నారు.

బీజేపీలో యాదవులకు ఆదరణ


బీజేపీలో పదవులు పొందిన యాదవులను సన్మానిస్తున్న దృశ్యం

జియాగూడ: బీజేపీలో యాదవులకు మంచి ఆదరణ లభిస్తుందని యాదవ సంఘం కన్వీనర్ గజ్జి మల్లేష్ యాదవ్, జియాగూడ యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి బి.శివకుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జియాగూడ యాదవ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు పసుపుల ఐలేష్ యాదవ్ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జియాగూడ డివిజన్‌లో ఉన్న యాదవులకు ఇటీవల బీజేపీలో నూతనంగా పదవులు లభించాయి. ముఖ్యంగా డివిజన్ అధ్యక్షుడిగా సలేంద్రి జగదీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేష్ యాదవ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా జిల్లాల వెంకటేష్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా సోంనాథ్ యాదవ్, కార్యదర్శిగా శ్రీనివాస్‌యాదవ్ ఇటీవల ఎన్నికయ్యారు. వారిని మంగళవారం ఘనంగా సన్మానించారు.

హైదరాబాద్ హిందూ ముస్లింల ఐక్యతకు చిహ్నం

గోల్కొండ: హైదరాబాద్ హిందూ ముస్లింల ఐక్యతకు చిహ్నం అని గోల్కొండ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ఎస్.రాజువస్తాద్ అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ మంగళవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా రాజువస్తాద్ మాట్లాడుతూ..హైదరాబాద్ మతసామరస్యానికి హిందూ ముస్లింల పవిత్ర స్నేహానికి ప్రసిద్ధి అని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు పండుగలను కలిసిమెలిసి నిర్వహించుకుంటారన్నారు.


రాజువస్తాద్‌తో మహ్మద్ నజీబ్ తదితరులు

యువకులు దైవభక్తిని పెంపొందించుకోవాలి



గోల్కొండ: నెల రోజుల ఉపవాస స్ఫూర్తితో యువకులు దైవభక్తిని పెంపొందించుకోవాలని మజ్లిస్ శాసన సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవారం షేక్‌పేట్ డివిజన్ మజ్లిస్ సీనియర్ నాయకులు మహ్మద్ ముస్తఫా మజ్లిస్ నాయకులతో అక్బరుద్దీన్ ఒవైసీని కలిశారు. ఈ సందర్భంగా తనను కలిసిన వారిని ఈద్ ముబారక్ అని శుభాకాంక్షలు తెలిపారు.

సమాజ సేవకు జైన్ సంఘ్ నిరంతర కృషి


ఉమా మహేశ్వరీని సత్కరిస్తున్న అమృత్‌కుమార్ జైన్, రవికుమార్

అబిడ్స్: సమాజ సేవ కోసం జైన్ సంఘ్ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అమృత్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. మంగళవారం అబిడ్స్‌లోని రాఘవరత్న టవర్‌లో జైన్ సంఘ్ తరపున ఉగాది పురస్కారాలు అందజేశారు. ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో యూట్యూబ్ భక్తి చానల్ ద్వారా కవరేజ్ నిర్వహించిన ఉమా మహేశ్వంరీని ఘనంగా సత్కరించి ఉగాది పురస్కార అవార్డు అందజేశారు. అనంతరం అమృత్‌కుమర్ జైన్ మాట్లాడుతూ..తమ సంస్థ ద్వారా వివిధ రంగాల్లో ప్రతిభను చాటుతున్న వారిని ప్రోత్సహిస్తూ వారికి నిరంతరం అవార్డులు అందజేసి అండగా నిలుస్తున్నామని వారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త సూరేపల్లి రవికుమార్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాల ప్రదానం


పురస్కార గ్రహీతలతో ఆచార్య వెలిదండ నిత్యానందరావు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువ కళావాహినీ ఆధ్వర్యంలో విశ్వావసు ఉగాది వేడుకలను మంగళవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష, సినీ సాహితీ ప్రభావం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలిదండ నిత్యానందరావు మాట్లాడుతూ..ప్రస్తుత కాలంలో తెలుగు భాష ఆందోళనకర స్థితిలో ఉందని, మాతృభాషను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అనంతరం సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, రచయితలు వివి.రామారావు, పి.రాజేంద్రకుమార్, ఆకెళ్ల శివప్రసాద్, విమర్శకులు ఎస్వీ రామారావులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్కినేని నాగేశ్వర్‌రావు నాటక కళా పరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, యువ కళావాహినీ అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

గోల్కొండ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని నిరసిస్తూ మంగళవారం బీజేపీ నాయకులు చలో హెచ్‌సీయూకు పిలుపునిచ్చారు. దీనిని దృష్టిలో పెట్టుకొని గుడిమల్కాపూర్ బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. టపాచబుత్ర పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన వారిలో బీజేపీ నాయకులు దేవర వంశీ, రాజేష్, మూర్తి తదితరులున్నారు.


పోలీసుల అదుపులో దేవర వంశీ తదితరులు

సీతారాముల కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న చైర్మన్, కమిటీ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక శివగంగానగర్‌లోని లక్ష్మణేశ్వర స్వామి శివాలయం ఆధ్వర్యంలో సీతారాముల 21వ కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆలయ ఆవరణలో చైర్మన్ మారెడ్డి దామోదర్‌రెడ్డి, ట్రస్టీలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ..అత్యంత ప్రాచీనమైన లక్ష్మణేశ్వర స్వామి ఆలయం లింగం ఆకారంలో ఉంటుందన్నారు. ఈ నెల 6న శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఆలయ అర్చకులు ఎస్.వి.శ్రీకాంతాచార్యులు, రామ్‌జీ పాండే మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం, రాత్రి పల్లకీ సేవ, ఈ నెల 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు పి.రమేశ్‌కుమార్, సూరం సత్యనారాయణ, ఎర్రోజు బాలాచారి, గోషిక రాజ్యలక్ష్మి, సలహాదారులు సోమనాథ్, రాజు యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బేగంబజార్ ఫిష్ మార్కెట్‌లో డ్రైనేజీ మరమ్మతులు



అబిడ్స్: బేగంబజార్ ఫిష్ మార్కెట్‌లో డ్రైనేజీ మరమ్మతులు నిర్వహించారు. కొన్ని రోజులుగా డ్రైనేజీ సమస్యతో బాధపడుతున్న వ్యాపారులు మంగళవారం డ్రైనేజీ సమస్య పరిష్కరించడంతో ఊపిరి పీల్చుకున్నారు. 15 రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లి స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు, వినియోగదారులు అవస్థలు పడ్డారు. గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ వాటర్ బోర్డు అధికారులను పిలిపించి డ్రైనేజీ మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో నాగోజీ, వినోద్, సంతు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. నాటకోత్సవం

అలరించిన సత్యహరిశ్చంద్ర నాటకం


సత్యహరిశ్చంద్ర నాటకంలో కళాకారుల అభినయం

ఫిలింనగర్: ఉగాది నాటకోత్సవాల్లో భాగంగా ఫిలింనగర్‌లోని ఫిలింఛాంబర్ రామానాయుడు కళామండపంలో రంగస్థల నాటకోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పాత్తూరి వెంకట సుబ్బారావు నేతృత్వంలో జరుగుతున్న ఈ నాటకోత్సవాల్లో రంగ స్థల కళాకారులు సత్యహరిశ్చంద్ర నాటకాన్ని మంగళవారం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. హైదరాబాద్ సురభి కళా నాట్యమండలి ఆధ్వర్యంలో చేసిన ఈ నాటక ప్రదర్శనలో హరి 1గా దేవనాథ్ సూరి, హరి 2గా సురభి నిఖిలేష్, చంద్రమతిగా లక్ష్మీశ్రీ, నక్షత్రకదా దుర్గా ప్రసాద్, కాల కౌశికగా దర్శి శ్రీనివాసరావు, శిశ్యగా నారాయణరావు నటించగా వీరికి హార్మోనియంపై సీహెచ్.నాగేశ్వర్‌రావు, నామా చంద్రబాబు నాయుడు, డోలక్‌తో రామకృష్ణ సహకారం అందించారు. ఈ సందర్భంగా కళాకారులను ఫినిక్స్ ఫౌండేషన్ చైర్మన్ చుక్కపల్లి సురేష్ అభినందించారు.

పేదలందరికీ సన్నబియ్యం అందించడమే లక్ష్యం

బండ్లగూడ: రాష్ట్రంలోని పేదలందరికీ సన్నబియ్యం చేరాలన్న చారిత్రాత్మక పథకానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సన్నబియ్యం ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా పేదలందరికీ పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారన్నారు. ఎన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు అయినా ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పథకం అన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా ఈ పథకాన్ని రద్దు చేయలేరన్నారు. దేశంలోనే అత్యధికంగా వడ్లను పండించిన రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచిందన్నారు. ఈసారి యాసంగిలో కూడా అత్యధికంగా దిగుబడి వచ్చే పరిస్థితి ఉందన్నారు. రైతుల శ్రమ ఎక్కడికి పోదని ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లో 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల మేరకు రుణమాఫీ చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ లతాప్రేమ్‌గౌడ్, మాజీ సర్పంచ్ హరికృష్ణ, పాండుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మీరాలంమండి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

- 1809 నుంచి పూజలు అందుకుంటున్న అమ్మవారు
- 2016 లో ఆలయ పునః నిర్మాణం
- వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు


వార్షికోత్సవానికి ముస్తాబైన ఆలయం

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ పునర్నిర్మాణ 9వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 2న నిర్వహించడానికి నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. 1809 నుంచి పూజలు అందుకుంటున్న మీరాలంమండి అమ్మవారి ఆలయాన్ని 2016లో పునర్ నిర్మించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా గాజుల అంజయ్య నియమితులైనప్పటి నుంచి ఆలయంలో ప్రతి ఏడాది ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. 9 ఏళ్ల క్రితం పాతబస్తీలోనే అత్యంత విశాలంగా ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం 9వ పునః నిర్మాణ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.


ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

భక్తిశ్రద్ధలతో అభిషేకాలు..

వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆలయంలోని అన్ని దేవతా విగ్రహాలకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించనున్నారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి సుప్రభాత సేవ, దేవతాభిషేకాలు, దీపారాధన, వార్షికోత్సవ సంకల్పం విగ్నేశ్వర పూజ, పుణ్యహవాచనం, మాతృక పూజ, నాంది, ఆచార్య రుత్విక్ వర్ణం, రక్షాబంధనం, ముఖ్యదేవతల స్థాపనం, ధ్వజారోహణం అనంతరం ఉదయం 8 గంటల నుంచి బ్రహ్మాది మండల స్థాపనం, యోగిని, లక్ష్మీ స్థాపనం, రుద్రపీఠ స్థాపనం, ఆంజనేయ సుబ్రహ్మణ్య స్థాపనం, నవగ్రహ దేవతా స్థాపన పూజ, ఉదయం 10:30 నుంచి నవగ్రహ హోమం, గణపతి హోమం, రుద్ర హోమం, యోగిని మండల హోమం, శ్రీ సూక్త హోమం, మన్యసూక్త హోమం, సర్పసూక్త హోమం, చండీ హోమం, బలి ప్రధానం, మహా పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. మధ్యాహ్నం 12:30 గంటలకు మహా నైవేద్యం, మధ్యాహ్న ఒంటి గంటకు పంచహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, 2 గంటల నుంచి అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.